

అంజన్న సన్నిధిలో రద్దీ

కొండగట్టు: అంజన్న సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. దాదాపు 20వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో వెంకటేశ్, అధికారులు పర్యవేక్షించారు.



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
33.0/19.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ యాష్మిన్‌బాషా

జగిత్యాలటౌన్: జిల్లాలో కొనసాగుతున్న హరితహారం, ఈజీఎస్ పనుల నిర్వహణపై కలెక్టర్ యాష్మిన్‌బాషా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పలు సూచనలు చేశారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మంద మకరంద్, డీఆర్‌డీఏ, డీపీవో, డీఎల్పీవో, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు మల్లికార్జున్



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మేడిపెల్లి(వేములవాడ): భీమారం మండలం గోవిందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి సాయిల్ల మల్లికార్జున్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్కంపల్లి రాజేష్ తెలిపారు. ఈ నెల 10న బిహార్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మల్లికార్జున్‌ను ఉపాధ్యాయులతో పాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ ప్రశాంత్, సర్పంచ్ మధుకర్, ఎంపీటీసీ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలతో పండిట్, పీఈటీల నిరసన



నిరసన తెలుపుతున్న పండిట్, పీఈటీలు

జగిత్యాలటౌన్: ఉపాధ్యాయ పదోన్నతుల్లో పండితులు, పీఈటీలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ 7వ రోజు మంగళవారం జిల్లా పరిషత్ ఎదుట పండిత, ఈటీ ఐక్యవేదిక బతుకమ్మలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, 2017లో తెలుగు మహాసభల్లో భాషా పండితులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అధికారులు అమలు చేయడం లేదని అన్నారు. కోర్టు తుది తీర్పునకు లోబడి భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యకార్యాచరణ సమితి భాగస్వామ్య సంఘాలు ఆర్‌యూపీపీటీ, ఆర్‌ఆర్‌యూపీపీటీఎస్ బాధ్యులు పడాల విశ్వప్రసాద్, దండె రాజేందర్, రాజేంద్రప్రసాద్, అశోక్, చంద సత్యనారాయణ, కటుకం నరేందర్, చంద్రశేఖర్, రాజుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె వెలుగులు

ఉపాధిహామీలో లక్ష్యం మించి పనులు

- పల్లెప్రగతిలో ఉమ్మడి జిల్లాల పనితీరు భేష్
- తలసరి ఆదాయంలో కరీంనగర్ టాప్
- సాగుదారులు, కార్మికుల సంఖ్య ఎక్కువే
- తేల్చిన సామాజిక, ఆర్థిక సర్వే-2023



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రబడ్జెట్‌లో భాగంగా ప్రభుత్వ ప్రణాళిక విభాగం తాజా సామాజిక ఆర్థిక సర్వేను ప్రకటించింది. సామాజిక ఆర్థిక సర్వే 2023 నివేదికను ప్రభుత్వం విడుదల చేయగా, అందులో గతేడాదితో పోల్చి చూస్తే జిల్లా అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించింది. రాష్ట్ర సరాసరితో పోల్చి చూస్తే తలసరి ఆదాయం తక్కువగా ఉన్నా, ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ జిల్లా తలసరి ఆదాయం అధికంగా ఉంది. పల్లె ప్రగతిలో ఉమ్మడి జిల్లాలు అత్యుత్తమ పనితీరు కనబరిచాయి. పంటల మార్పిడి, పంటసాగు వైవిధ్యంలో పెద్దపల్లి, కరీంనగర్ రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలిచాయి. ఆర్థికసర్వేలో ఉమ్మడి జిల్లా వివిధ రంగాల్లో పనితీరు వివరాలు..

లింగ భేదం పెరుగుతోంది..

ఉమ్మడి జిల్లాలో లింగనిష్పత్తి చూసినట్లయితే ప్రతీ వెయ్యి మందికి జగిత్యాలలో 1,002, సిరిసిల్లలో 1,014 మంది ఉన్నారు. అదే కరీంనగర్‌లో 993 మంది, పెద్దపల్లిలో 992 మంది మాత్రమే ఉన్నారు. అదే లింగనిష్పత్తి 0–6 వయస్సు ఉన్న చిన్నారుల్లో చూస్తే ప్రతీ వెయ్యి మంది బాలికలకు జగిత్యాలలో 947, సిరిసిల్లలో 942, కరీంనగర్‌లో 931, పెద్దపల్లిలో 922 మంది మాత్రమే ఉన్నారు.

అక్షరాస్యత శాతం..




ఉమ్మడి జిల్లా పూర్తిగా పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాల కలయిక వల్ల రాష్ట్ర సగటు కంటే తక్కువగానే ఉంది. రాష్ట్ర సరాసరి అక్షరాస్యత 66.54 శాతం ఉండగా, కేవలం కరీంనగర్ జిల్లా 69.16 శాతంతో రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది. మిగిలిన జిల్లాలు తక్కువగా ఉన్నాయి.



విద్యుత్ కనెక్షన్లలో భేష్




ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, ఇండస్ట్రీయల్ విద్యుత్ కనెక్షన్లలో జగిత్యాల టాప్‌లో ఉండగా, వ్యవసాయ కనెక్షన్లలో పెద్దపల్లి, ఇండస్ట్రీయల్ కనెక్షన్లు సిరిసిల్లలో తక్కువగా ఉన్నాయి.



పల్లెప్రగతిలో ముందంజ




రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పల్లెప్రగతి నివేదికలను యాప్‌ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ద్వారా ఉమ్మడి జిల్లాలు పల్లెప్రగతి ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ మినహా మూడు జిల్లాలు రాష్ట్రంలోనే టాప్ 10 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి.



లక్ష్యం మించి ఉపాధిహామీ




ఉమ్మడి జిల్లాలో లక్ష్యం మించి పనిదినాలు కల్పించటంలో అన్ని జిల్లాలు పోటీపడ్డాయి. అత్యధికంగా పెద్దపల్లి 121 శాతం పనిదినాలు కల్పించగా, జగిత్యాల 105 శాతం పనిదినాలతో ఉమ్మడి జిల్లాలో చివరిస్థానంలో నిలిచింది.



పనిచేసే వారు ఎక్కువే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం జనాభాలో సగటున 52 శాతం మంది పనిచేస్తున్నారు. ఇందులోనూ వ్యవసాయ ఆధారిత పనుల్లోనే అత్యధికంగా ఉపాధి లభిస్తోంది.



రేషన్ కార్డులే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు, రేషన్ కార్డులు కుటుంబాల కంటే అధికంగా ఉన్నాయి. ఇందులో అన్నపూర్ణ, అంత్యోదయ, ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డుల్లో జగిత్యాల, గ్యాస్ కనెక్షన్లలో కరీంనగర్ టాప్‌లో ఉన్నాయి.

జిల్లా	రేషన్ దుకాణాలు	మొత్తం కార్డులు	గ్యాస్ కనెక్షన్లు (లక్షల్లో)
కరీంనగర్	487	2,80,895	3.95
పెద్దపల్లి	413	2,22,524	2.18
జగిత్యాల	587	3,10,545	3.05
సిరిసిల్ల	344	1,75,484	1.45

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): ప్రజాభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక రైతువేదికలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, కొత్త పింఛన్ మంజూరు పత్రాలను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి పల్లెప్రగతి ద్వారా ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అనంతరం మద్దులపల్లిలో చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే.. సర్పంచులతో తానే నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడతానన్నారు. జూన్‌లో చేపట్టే తొమ్మిదో విడత హరితహారాన్ని విజయవంతం చేసి రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఆర్డీవో మాధురి, ఎంపీపీ శోభ, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ జమున, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎండీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, వైస్ ఎంపీపీ గంగాధర్, సింగిల్‌విండో చైర్మన్లు రమణారావు, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, ఆర్బీఎస్ మండల కన్వీనర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 5న వంట గ్యాస్ సిలిండర్ పేలి మంటల్లో గుడిసె కాలిపోయిన రాజారాంపల్లిలోని కనుకయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి ఈశ్వర్ భరోసా ఇచ్చారు. డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. బీఆర్ఎస్ నుంచి రూ.2.50 లక్షలు, రూ.50 వేల విలువైన నిత్యావసరాలను బాధిత కుటుంబానికి అందజేశారు.

డీసీఆర్‌బీ డీఎస్పీ బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న రామానుజంను బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఏసీపీగా బదిలీ చేశారు.

హామీల అమలులో విఫలం

మేడిపెల్లి(వేములవాడ): హామీలు నేరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ పాదయాత్రకు సంఘీభావంగా మంగళవారం భీమారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. రాహుల్ గాంధీ రాసిన లేఖ, బీజేపీ, బీఆర్ ఎస్ పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, నాయకులు లచ్చనాయక్, నర్సయ్య, శంకర్, నరేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్ హయాంలోనే పంచాయతీలకు నిధులు

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామ పంచాయతీలకు అధికంగా నిధుల కేటాయింపు జరుగుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడమే కాకుండా ప్రస్తుతం వాటిల్లో సొంత భవనాల కోసం నిధులను మంజూరు చేసిందన్నారు. పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, పంచాయతీల్లో రోడ్ల అభివృద్ధికి ఇటీవలే పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని, పనులు తొందరగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై ప్రచారం నిర్వహించాలి

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకునేలా మున్సిపల్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సూచించారు. స్థానిక బోయవాడలో ఉన్న కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అవసరమైన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. అనంతరం లక్ష్మీనృసింహాస్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

యాసంగికి 'త్రీఫేజ్' షాక్

- జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోతలు
- ఆగమాగం అవుతున్న అన్నదాతలు
- పంటలు ఎండుతున్నాయని వేదన
- పెరుగుతున్న వినియోగమే కారణం
- విద్యుత్ అధికారుల వివరణ



- ఇక్కడ నిరీక్షిస్తున్న రైతు పేరు క్యాతం సాయిరెడ్డి, రాయికల్ మండలం సింగరావుపేట స్వగ్రామం. తనకు ఐదుచోట్ల సుమారు ఆరు ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉంది. అందులో ఈ యాసంగిలో వరి వేశాడు. ఎక్కడ విద్యుత్ కోత ఉంటుందో, ఎక్కడ సరఫరా ఉంటుందో తెలియక అయోయపడుతున్నాడు. కొన్నిసార్లు పంపుసెట్ వద్దకు వెళ్లేవరకే కరెంట్ సరఫరా నిలిచిపోతోంది. మళ్లీ సరఫరా అయ్యేదాకా ఇదిగో ఇలా నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి అప్రకటిత కోతలను నిరసిస్తూ అన్నదాతలు కొద్దిరోజులుగా రోడ్లెక్కుతున్నారు.

కరెంటు కోతలపై రైతన్న నిరసన

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కష్టపడి పంటలు పండిస్తున్న రైతులకు 24 గంటలు కరెంట్ ఇవ్వకుండ కోత విధించడంతో ఇబ్రహీంపట్నంలో మంగళవారం రైతులు సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరంతరం త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పినా రైతులు వినకపోవడంతో సబ్ ఇంజినీర్ రాజేశ్‌నాయక్ వచ్చి రైతులతో మాట్లాడినా రాస్తారోకో విరమించలేదు. అనంతరం ఏడీ శ్రీనివాస్‌రావుతో మాట్లాడించగా త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయాలని కోరారు. ఏడీ ఆదేశాల మేరకు త్రీఫేజ్ సరఫరా చేయడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, రైతులు బోడ చిన్న లింగం, కల్లెం సత్యరెడ్డి, ఎనుగు నరేందర్, బొర్రన్న తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేక కోతలు విధించాల్సిన అనివార్య పరిస్థితి ఎదురవుతోందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే, కరెంటు కోతలతో ఈ యాసంగి పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహిస్తూ అన్నదాతలు కొద్దిరోజులుగా జిల్లావ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలు చేస్తున్నారు.

ఎప్పుడు వస్తుందో..

- జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో దాదాపు 4.30 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతున్నాయి.
- ఇందులో అగ్రస్థానం వరిదే. సుమారు 3.10 లక్షల ఎకరాల్లో పండిస్తున్నారు.
- వరికి రోజూ నీటి అవసరం ఉంటుంది.
- ఉదయం నుంచి ఏకధాటిగా వ్యవసాయ మోటార్లు నడిస్తేనే అవసరమైన నీళ్లు పొలంలో ఉంటాయి.
- సరిపడా నీళ్లు లేకుంటే కలుపు మొక్కలు వృద్ధి చెందుతాయి. మొక్కలు ఎండిపోతాయి.
- కానీ, 15 రోజులుగా వ్యవసాయ రంగానికి అవసరమైన త్రీఫేజ్ కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు.
- కరెంట్ కోసం రైతులు పొలాల వద్దే పడిగాపులు కాస్తున్నారు.
- కరెంట్ ఎప్పుడు వస్తుందంటూ సబ్‌స్టేషన్, కంట్రోల్ రూం, ఏఈవోలకు తరచూ ఫోన్‌చేస్తూ కోతలపై గొడవకు దిగుతున్నారు.
- అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలు తాము పాటించాల్సిందే తప్ప ఏమీ చేయలేమని వారు బదులిస్తూ మొబైల్‌ఫోన్లు స్విచ్చాఫ్ చేస్తున్నారు.

ఆందోళన బాటలో రైతులు..

- త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో అప్రకటిత కోతలను నిరసిస్తూ అన్నదాతలు ఆందోళన బాటపట్టారు.
- ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.
- మొన్న జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు.
- మంగళవారం ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేశారు.
- 24గంటలు కాకున్నా.. ఇచ్చే ఐదారు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.
- ఇందుకోసం గ్రామాల వారీగా టైంటైబుల్ ప్రకటించాలని కోరుతున్నారు.

ఎప్పుడు వస్తుందో



నేను వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తే కరెంట్ లేదు. సబ్‌స్టేషన్ వాళ్లకు ఫోన్ చేస్తే ఉదయం 11 గంటలకు వస్తదన్నారు. 11 గంటలకు వెళ్లినా కరెంట్ రాలేదు. దీంతో, ఇంటికి వచ్చిన. 12 గంటలకు కరెంట్ వచ్చింది. మళ్లీ పొలం కాడికి పోయిన.

– కుంట జలపతిరెడ్డి, ఇటిక్యాల, రాయికల్

చర్యలు తీసుకుంటున్నం



జిల్లాలో విద్యుత్ వినియోగం పెరగడంతో సరఫరాలో ఇబ్బందులు తలెత్తున్నాయి. అయినప్పటికీ ఎక్కడ కూడా పంటలు ఎండకుండా చర్యలు తీసుకుంటాం. విద్యుత్ డిమాండ్‌ను బట్టి అధిక లోడ్‌ను తీసుకుంటున్నాం. రైతులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలుగనీయం.

– జి.సత్యనారాయణ, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్

పెరుగుతున్న వినియోగం

జిల్లాల్లో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. సాగు విస్తీర్ణం, ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో గృహావసరాలూ పెరుగుతున్నాయి. పంటలకూ విద్యుత్ అవసరం అధికం అవుతోంది. కానీ, ఇందుకు అవసరమైన కరెంట్ సరఫరా లేదు. వినియోగాన్ని బట్టి జిల్లాకు నెలకు ఇన్ని యూనిట్లు అని ఉన్నతాధికారులు కేటాయిస్తారు. 2022 నవంబర్ వరకు విద్యుత్ వినియోగం పెద్దగా లేదు. కానీ, 2022 డిసెంబర్ నుంచి వినియోగం అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. జిల్లాకు అప్పటి కోటా 86.87 మిలియన్ యూనిట్లు కాగా, అంతకుమించి 109.347 మిలియన్ యూనిట్లు ఖర్చు అయ్యింది. 2023 జనవరిలో 107.87 మిలియన్ యూనిట్లు కాగా, 116.657 మిలియన్ యూనిట్లు వినియోగించారు. ఫిబ్రవరి కోటా 95.71 మిలియన్ యూనిట్లు, మార్చి కోటా 130.04 మిలియన్ యూనిట్లుగా లక్ష్యం పెట్టుకున్నారు. కానీ, జనవరిలోనే టార్గెట్‌ను మించి విద్యుత్ వినియోగించారని అధికారులు చెబుతున్నారు. జిల్లాకు కేటాయించిన కోటాకు మించి విద్యుత్ వినియోగిస్తే ఉన్నతాధికారుల నుంచి చీవాట్లు తినాల్సి వస్తోందని, మోమోలు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

క్లుప్తంగా

ఉత్తర తెలంగాణపై సీఎం వివక్ష

కోరుట్ల రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఉత్తర తెలంగాణపై వివక్ష చూపుతున్నారని టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం కోరుట్లలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తర తెలంగాణ ప్రాంతానికి వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పైన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టుకు శ్రీరాంసాగర్ జలాలను తోడు కోవాలని కేసీఆర్ అనడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని తన సొంత జాగీరుగా వాడుకుంటున్నాడని విమర్శించారు. బాబ్లీద్వారా మహారాష్ట్ర నీళ్ల తోడుకుంటే ఉత్తర తెలంగాణలోని రైతాంగానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్‌కు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబెతారని పేర్కొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



అడవుల ప్రాముఖ్యతపై వివరిస్తున్న ఎఫ్‌ఆర్‌వో

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. వనదర్శిని కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ అధికారులు మండలంలోని వేములకుర్తి అడవిలోకి తీసుకెళ్లి అడవుల ప్రాముఖ్యతను వివరించారు. అడవులు పెంచడం వల్ల అధిక వర్షాపాతంతో పాటు పర్యావరణాన్ని రక్షించవచ్చని, జంతువులు కూడా అడవుల్లోనే ఉంటాయని వివరించారు. మొక్కలు నాటి చెట్లు ఎలా పెంచుతామో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని గోధూర్ సెంట్రల్ నర్సరీలో వివిధ రకాల మొక్కల పెంపకంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సాకత్‌హాలీ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆఫీసొద్దీన్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, బీట్ ఆఫీసర్లు రత్నాకర్, శ్రావణ్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాము అన్నారు. ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 54 మందిని కోర్టులో హాజరుపర్చగా మంగళవారం న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.54 వేల జరిమానా విధించారు. అనంతరం వారికి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఏటీఎంలో షార్ట్ సర్క్యూట్

రామగుండం: అంతర్గాం జంక్షన్‌లోని ఓ ప్రైవేటు ఏటీఎం సెంటర్‌లో మంగళవారం రాత్రి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికులు సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో భారీ ప్రమాదం తప్పింది. కాగా ఏటీఎం లోపలి భాగం అగ్నికి ఆహుతైనప్పటికీ అందులోని కరెన్సీకి ఎలాంటి నష్టం జరగలేదు. కొన్ని రోజులుగా ఏటీఎంలోని ఏసీ పనిచేయకపోవడంతో పాటు క్యాబిన్‌లోకి ఎండ నేరుగా పడటంతో మెషనరీ వేడెక్కి షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న అంతర్గాం ఎస్సై సంతోశ్‌కుమార్ ఏటీఎం వద్దకు చేరుకొని ఇరుప్రక్కల మంటలు వ్యాపించకుండా చర్యలు చేపడుతూ ప్రమాదానికి దారితీసిన విషయమై ఆరా తీశారు.





కన్నుల పండువగా రథోత్సవం

రాయికల్(జగిత్యాల): పట్టణంలో భీమన్న రథోత్సవం మంగళవారం కన్నులపండువగా జరిగింది. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రాయికల్, మల్లాపూర్, మేడిపల్లి మండలాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, ఆలయ కమిటీ నిర్వాహకుడు దేవుని నర్సయ్య, భీమన్న యూత్ సభ్యులు, కౌన్సిలర్లు మహేశ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, మ్యాకల అనురాధ, కన్నక మహేందర్, శ్రీరాముల సత్యనారాయణ, సాయికుమార్ పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణపై వైఖరి స్పష్టం చేయాలి



మాట్లాడుతున్న మహేందర్

ధర్మపురి: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణపై బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు స్పష్టమైన వైఖరిని తెలియజేసి పాదయాత్ర కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దీకొండ మహేందర్ అన్నారు. ధర్మపురిలోని అంబేద్కర్ సంఘ భవనంలో మంగళవారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని గొల్లపల్లి, పెగడపెల్లి, ధర్మారం మండలాల్లో గత కొన్ని రోజుల నుంచి బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ పాదయాత్ర చేస్తున్నారని అట్టి పాదయాత్ర కేవలం గ్రామాల్లోని మాదిగ పల్లెల్లోనే కొనసాగించడం అత్యంత బాధాకరమన్నారు. కేవలం ఓట్లు చీల్చడం కోసమే పాదయాత్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీల వర్గీకరణకు గత 28 ఏళ్లు మందకృష్ణ మాదిగ పోరాటం చేస్తున్న విషయాన్ని మరిచిపోయారా అని గుర్తు చేశారు. వర్గీకరణపై స్పష్టమైన వైఖరిని తెలియజేసి పాదయాత్ర కొనసాగించాలని డిమాండు చేశారు. సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరికెల్ల సతీష్, దళిత సంఘాల రాష్ట్ర కార్యదర్శి పారపెల్లి రాజమల్లయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రవి, ప్రేమిత్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మిల్లర్ ఢీకొని.. చిరువ్యాపారి దుర్మరణం



రాజనర్సు మృతదేహం వద్ద కుటుంబసభ్యుల రోదనలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో మిల్లర్ ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం చెందాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముస్తాబాద్‌కు చెందిన కొండుగారి(మీస) రాజనర్సు(62) కూరగాయల మార్కెట్‌లో భార్య నర్సవ్వ కలిసి కొంత కాలంగా కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం రాజనర్సు మార్కెట్ నుంచి భోజనానికి ఇంటికి వెళ్తుండగా రోడ్డు పనులలో ఉన్న మిల్లర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజనర్సు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు తనతోపాటు కూరగాయలు విక్రయించిన భర్త విగతజీవిగా మారడంతో భార్య నర్సవ్వ రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు కోరడంతో.. జెడ్పీటీసీ నర్సయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, సంతోష్‌రావు, నల్ల నర్సయ్య చర్చించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్లకు తరలించారు. మృతుడికి భార్య నర్సవ్వ, కుమారుడు బాబుకిషన్, కుమార్తె భవిత ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

ఐదు ఆలయాల్లో చోరీ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కేడీసీసీ బ్యాంకు పరిసరాల్లోని ఎల్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపారు. దొంగలు ఆలయ ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి గర్భగుడి తాళం కూడా పగులగొట్టారన్నారు. హుండీ ఎత్తుకెళ్లి అందులోని నగదు, దేవతలకు అలంకరించిన 4 గ్రాముల పుస్తెలు, 4 గ్రాముల బొట్టు బిల్ల, 3 గ్రాముల ముక్కు పుడక తదితర వస్తువులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. నాగుల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేములవాడ అర్బన్ ప్రాంతంలో..

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. మండలంలోని రుద్రవరం ఎల్లమ్మ ఆలయంలో 10 తు లాల వెండి, హుండీ, పావుతులం బంగారం, పెద్దమ్మ ఆలయంలో బంగారుపుస్తె, మెట్టెలు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. అనుపురం గ్రామంలోని రామాలయంలో హుండీని ఎత్తుకెళ్లారు. ఆరెపల్లి గ్రామంలోని శ్రీ హనుమాన్ ఆలయంలో హుండీ తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం వేములవాడటౌన్ ఎస్సై వెంకట్రాజం చోరీ జరిగిన ఆలయాలను, సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వరుసగా కరీంనగర్– సిరిసిల్ల రహదారిని అనుకుని ఉన్న మూడు గ్రామాల్లో నాలుగు ఆలయాల్లో చోరీ జరగడంతో పోలీసులు దొంగల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ వివరించారు.

ఉపసర్పంచ్, వార్డు సభ్యుల రాజీనామా



రాజీనామా పత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

జగిత్యాలరూరల్: చెర్లపల్లి సర్పంచ్ తిరుపతి తీరుకు వ్యతిరేకంగా ఉపసర్పంచ్ బండారి రాజిరెడ్డి, వార్డు సభ్యులు ఇత్తడి రాజేశం, గుగ్గిళ్ల మురళి, ఉమ్మడి లత మంగళవారం తమ పదవికి రాజీనామా చేశారు. గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ పనులకు ఆహ్వానించడం లేదని, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాడని వారు ఆరోపించారు. ఈమేరకు ఎంపీడీవో రాజేశ్వరికి మంగళవారం రాజీనామా లేఖలు అందజేశారు.

మాతా రమాబాయి జయంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఇల్లు గడవక కటిక దారిద్ర్యంలో సైతం మొక్కవోని ధైర్యంతో మాతా రమాబాయి దేశానికి అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించేలా అండగా నిలిచారని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాతా రమాబాయి జయంతిని ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ, మాతా రమాబాయికి చిన్న వయస్సులోనే వివాహం జరిగినా బాబాసాహెబ్‌కు అన్ని విషయాలలో అండగా నిలిచారన్నారు. అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని అందించడంలో రమాబాయి పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన కొడుకుపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన పుట్ట కమలను చంపుతానని బెది రించిన ఆమె కొడుకు పుట్ట ప్రణయ్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. ప్రణయ్ రెండేళ్ల క్రితం ఇంట్లో తెలియకుండా సబిత అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు ఇంట్లోకి రానివ్వకపోవడంతో వేరే చోట నివాసం ఉంటున్నాడు. జనవరి 30న తల్లి కమల ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లగా ప్రణయ్ ఇంటి తలుపులు, తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. తర్వాత ఆమెను బూతులు తిట్టడంతో పాటు చంపుతానని బెదిరించడంతో బాధితురాలు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టా భూమి ఆక్రమణకు యత్నిస్తున్నారని..

కోరుట్ల: మున్సిపల్ విలీన గ్రామం యెఖీన్‌పూర్ శి వారులో చిట్యాల నారాయణకు సంబంధించిన ప ట్టా భూమిని వనతడుపుల అరుణ్‌కుమార్ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాలు.. యెఖీన్‌పూర్–వేములవాడ రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 452లో గల 15 గుంటల స్థలం కొన్నేళ్లుగా చిట్యాల నారాయణ తండ్రి, తాతల పేరు మీద ఉండగా సదరు భూమిలో సోమవారం బాధితుడు బేస్‌మిట్ నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో వనతడుపుల అరుణ్‌కుమార్ వచ్చి సదరు భూమిని తాను కొనుగోలు చేశానని నారాయణ, అతడి తమ్ముడు నర్సయ్యపై దాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలోపడి వృద్ధుడి ఆత్మహత్య

రాయికల్(జగిత్యాల): మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన మోతె పెద్దులు (87) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మోతె పెద్దులు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పాటు భార్య చనిపోయిందనే ఆవేదనతో జీవితంపై విరక్తి చెందాడు. వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన నస్కూరీ నాగరాజు (30) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. నాగరాజు కొద్దికాలంగా మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం తాగుతున్నావని ఆదివారం తండ్రి నర్సయ్య తల్లి ఈశ్వరమ్మ మందలించారు. దీంతో తాగినమైకంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

చల్‌గల్‌లో మహిళ..

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన ఎండి.షాహిదాబేగం (45) సోమవారం రాత్రి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలు.. షాహిదాబేగం గత 20 ఏళ్ల నుంచి బీపీ, షుగర్‌తో బాధపడుతోంది. ఆమె భర్త కూడా సంవత్సరం క్రితం పెరాలసిస్ వచ్చి మంచంలోనే ఉంటున్నాడు. తనకున్న అనారోగ్యంతో పాటు భర్తకు కూ డా సేవ చేసేందుకు ఇబ్బందులు పడుతుండడంతో జీవితంపై విరక్తి చెంది మ నస్తాపంతో షాహిదాబేగం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడు షాజిద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

వైభవం.. వన మహోత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు లక్ష్మీ అమ్మవారితో గజవాహనంపై కొండ కిందికి వచ్చి బీర్‌పూర్ అటవీప్రాంతంలో వనదేవతకు పూజలు నిర్వహించే కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. వృక్షోరక్షితి రక్షితః అన్న దానికి మానవాళి కట్టుబడి ఉంటేనే మనం చల్లగా ఉండగలుగుతామని దీంతో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారని అర్చకులు పేర్కొన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్‌ను కూడా లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని, అందుకే ప్రకృతిని, వన్యప్రాణులను, భూదేవిని కాపాడుకోవాలన్నది స్వామివారి ఆదేశం అని అర్చకులు వివరించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్వామివారికి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, జెడ్పీటీసీ పాత పద్మ, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, బందెల మరియ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఈవో శ్రీనివాస్, అటవీశాఖ సెక్షన్ అధికారి గంగారాం, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సర్వసభ్య సమావేశం

- శాఖ గ్రంథాలయాల్లో సౌకర్యాల కల్పనకు ఆమోదం



సమావేశంలో చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయ చైర్మన్

జగిత్యాలటౌన్: జిల్లా గ్రంథాలయ సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. చైర్మన్ జీ.చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో 2023–24ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. గొల్లపల్లి, ఇబ్రహింపట్నం శాఖ గ్రంథాలయాలకు ప్రహరీలు నిర్మించుటకు, టాయిలెట్లు, బోరింగ్‌లు ఏర్పాటు చేయుటకు టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీఈలకు అంచనాల తయారీకి అనుమతించారు. జిల్లా కలెక్టర్ ఫండ్స్‌తో ఫర్నీచర్, కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయుటకు నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రెటరీ సరిత, సభ్యులు మారంపెల్లి బాబు, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, డీపీవో నరేష్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ ప్రతినిధులు

జగిత్యాల కలెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన షేక్ యాస్మిన్ బాషాను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, సభ్యులు మంగళవారంమర్యాదపూర్వకంగాకలిశారు. కలెక్టర్‌కుపూల గుచ్ఛంఅందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి కొప్పుల

ధర్మపురి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎస్సీ కాలనీల్లో సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో గ్రామాల్లో చేపట్టే 41 పనులకు రూ.3 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారు. మంగళవారం మంత్రి ఈశ్వర్ చేతుల మీదుగ గ్రామాల ఎంపీటీసీలకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ నిధులను గ్రామాల్లోని సీసీరోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి ఖర్చు చేయనున్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రికి ఎంపీటీసీలు కృతజ్ఞతలు తెలిపారు.

నేతకాని కుల సంఘాల అభివృద్ధికి కృషి

నేతకాని కుల సంఘాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మంత్రి ఈశ్వర్ అన్నారు. మండలంలోని జైనా గ్రామంలో నేతకాని కుల సంఘభవనం నూతన నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేశారు. మంగళవారం కులసంఘం ఆధ్వర్యంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టేకుమట్ల ప్రభాకర్, నాయకులు దుర్గం రవీందర్, రాజేందర్, రాజన్న, జాడి రాజశేఖర్ తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

వెల్గటూర్(ధర్మపురి): తెలంగాణలోని ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఈశ్వర్ అన్నారు. వెల్గటూర్ మండలంలో లేబర్ కార్డు కలిగి ఇటీవల మరణించిన 5 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.లక్ష 30 వేల చొప్పున మొత్తం రూ.6 లక్షల 50వేల రూపాయల విలువగల చెక్కులను కలెక్టర్ యాస్మిన్ భాషాతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.సుధారాణి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సిగిరి ఆనంద్, రాజక్కపల్లి సర్పంచ్ బోడకుంటి రమేష్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు గుండ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, వెల్గటూర్ గౌడ సంఘం అధ్యక్షుడు బందెల నర్సయ్య, ఎండపల్లి మండల యూత్ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిద్ధార్థ

వెల్గటూర్(ధర్మపురి): తెలంగాణలో పేదప్రజలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ఉచిత విద్య, వైద్యం సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. నవంబర్ 5, 2022 న మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో మొదలైన చైతన్య యాత్ర మంగళవారంతో 159 రోజుల్లో 15,900 కి.మీ. పూర్తి చేసుకొని వెల్గటూర్ మండలం శాఖాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాల్లో దేశ జీడీపీలో 8 శాతానికి పైగా విద్యా రంగానికి, 5 శాతానికి పైగా వైద్య రంగానికి కేటాయిస్తుండగా మన దేశంలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 3.5 శాతం లోపు నిధులు ఖర్చు చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. ఈ విషయాలను వివరిస్తూ శాఖాపూర్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం



ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం జవారిపేటలో రైతు అన్నాడి రవీందర్‌రెడ్డి ఇంట్లో నిల్వ చేసిన పత్తి మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. స్థానికులు బిందెలతో నీరు చల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సిరిసిల్ల నుంచి ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేశాయి. 15 క్వింటాళ్ల పత్తి దగ్ధం కావడంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడితే చర్యలు

సిరిసిల్లక్రైం: నెలరోజులుగా నిర్వహించిన డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన 82మందిని కోర్టులో హాజరుపరిచామని వారికి కోర్టు జరిమానా విధించడం జరిగిందని సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్ కుమార్ మంగళవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. టౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ ఎస్సై రాజు సమక్షంలో డంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.